క్లుప్తంగా

మొక్కల పంపిణీ

కడియం: శ్రీశైలం దేవస్థానంలో సామూహిక గౌరీవ్రతాల్లో భాగంగా స్థానిక నర్సరీ రంగ ప్రముఖులు, టీవీసీ చారిటబుల్ ట్రస్టు అధినేత తాడాల విష్ణుచక్రవర్తి ఆధ్వర్యంలో భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. జమ్మి, తులసి, బిల్వపత్రం, ఉసిరి తదితర ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన మొక్కలను భారీ ఎత్తున పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డి, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ శ్యామ్యూల్ మంగళవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రెవెన్యూ కాలనీ, రాజీవ్ కాలనీ, ఎమ్ఆర్‌ఓ ఆఫీస్, పాలిటెక్నిక్ కాలేజ్, గాయత్రీనగర్, ఎంప్లాయిస్ కాలనీ, ఏఎంజీ కాలేజీ, రాజవోలు ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

రూరల్ గ్రామాల్లో..

రూరల్‌లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్తు అంతరాయం ఉంటుంది. కొంతమూరు నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లింపేట, అంబేడ్కర్ పేట, అఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్, బ్రాహ్మణ అగ్రహారం, బూసమ్మ కాలనీ, బీసీ కాలనీ, శ్రీరామ్ నగర్, వీవీ కొండయ్య నగర్, కాతేరులోని బ్రాహ్మణ అగ్రహారం, ఎంప్లాయిస్ కాలనీ, క్వారీ రోడ్ కొంతమూరులో కళ్యాణ్‌నగర్, ఆదర్శనగర్, ఫోర్త్ బ్రిడ్జి ఏరియా, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, సున్నంబట్టీ రోడ్, ఎస్ఎస్ఆర్ఆర్ లేఅవుట్, రాజరాజేశ్వరి నగర్, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, మెయిన్‌రోడ్, అఫీషియల్ కాలనీ, చందన రమేష్ లేఅవుట్, చెంచు కాలనీ, విడో కాలనీ, తేజా నగర్, శానిటోరియం ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

ఓటు హక్కుపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో యువతకు మంగళవారం ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వేయడం పౌరుని బాధ్యత అని తెలిపారు. రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి పి.బాబ్జి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు.

34 మందిపై కేసు


కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 34 మందిపై కేసులు నమోదు చేసినట్టు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు పట్టణంలో రోడ్ యాక్సిడెంట్లను తగ్గించాలని ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడుపుతున్న వాహనదారులను గుర్తించామని ట్రాఫిక్ డీఎస్పీ చెప్పారు.

ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం సిటీ: సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ సైబర్ నేరాలు అధికమవుతున్న నేపథ్యంలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ తటవర్తి శ్రీనివాసరావు, సైబర్ క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక శేషయ్య మెట్ట వద్ద కమ్యూనిటీ హాలులో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్టేట్ బ్యాంకు ఆర్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా టౌన్ హాలు మీటింగ్స్ పేరిట సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఓటీ నుంచి చీఫ్ మేనేజర్లు ఎస్‌వీవీ స్వామి, కె.శ్రీనివాస కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ చీకటి రోజులు!

- ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే భయం
- విష సర్పాలు, కుక్కలతో ఆందోళనకరం
- కానరాని వీధి దీపాల వెలుగులు



చీకట్లో కుక్కల హల్‌చల్

రాజమహేంద్రవరం రూరల్: ఎక్కడో మారుమూల అనుకుంటే పొరబడినట్టే... సమస్యలు తీర్చే అధికారులు రోజూ తిరిగే మార్గమది. సాయంత్రం 6 గంటలు దాటితే చాలు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోంది.. చీకటి అలముకుని భయానకంగా మారుతోంది.. కనీసం ఆ ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో రూరల్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు, వైటీసీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలు సాగించాలంటే చీకటి కష్టాలు తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో ఉద్యోగులు రాత్రి 9 గంటల వరకూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. అటువంటి సమయంలో ఉద్యోగులు బిక్కుబిక్కుమని వెళ్లాల్సి వస్తోంది. ఎక్కడ విష సర్పాలు, శునకాలు దాడులు చేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. ధవళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో మహిళా ప్రాంగణం నుంచి రెవెన్యూ కాలనీకి వెళ్లే రహదారిలో రూరల్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు, వైటీసీ కేంద్రంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, డ్వామా, జిల్లాప రిశ్రమల శాఖ, జిల్లా అగ్నిమాపక, సమాచార శాఖ, ఏపీఎస్ఎస్‌డీసీ, ఏపీఎంఐడీసీ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అక్కడకు వచ్చే సీసీ రోడ్డులో కనీసం ఒక వీధి దీపం కూడా లేకపోవడంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఉద్యోగులంతా రాత్రి సమయాల్లో అంధకారంలోనే ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. వైటీసీలో ఉన్న ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న ఉద్యోగులు చీకటికి ముందుగానే వెళ్తున్నప్పటికీ కొంతమంది మాత్రం రాత్రి సమయాల్లో విధులు నిర్వహించాల్సి ఉంది. అలాగే రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం అధికారులతో పాటు వీఆర్వోలు, సర్వేయర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు రాత్రి 9 గంటల వరకూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ వచ్చేందుకు కార్యాలయ ఆవరణలో రెండు వీధిదీపాలు వేసినప్పటికీ అవి కూడా ప్రస్తుతానికి వెలగడం లేదు. దీంతో ఉద్యోగులు ఆ చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు.

భయం భయంగా..

చీకట్లో ఉద్యోగులు రాకపోకలు సాగించడం వల్ల ఎక్కడ విష సర్పాలు కాటేస్తాయోనని, శునకాలు ఎక్కడ మీద పడతాయోనని భయం భయంగా సాగుతున్నారు. ఇటీవల కాలంలో విషసర్పాలు ప్రభుత్వ కార్యాలయంలోకి చొరబడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది వాటివల్ల ఎటువంటి హాని కలుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే సిమెంట్ రోడ్డులో ధవళేశ్వరం పంచాయతీ అధికారులు వీధిదీపాలు వేశారు. మందుబాబులు మద్యం తాగేందుకు వీధి దీపాలను పగలుగొట్టే పనులు చేపట్టడంతో వీధిదీపాలు వేయాలన్నా ముందుకు రావడంలేదు. తహసీల్దార్ కార్యాలయంలో వేసిన రెండు వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటి తప్పడం లేదు. సైన్స్ సెంటర్ ఆవరణలో ఉన్న ఒక లైట్ వెలుగు మాత్రం ఆ రోడ్డు మొత్తానికి చిన్న వెలుగుగా ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వెలగని వీధి దీపాలు

తగిన చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్, వైటీసీలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు రోజూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటు ప్రజలు వెళుతుంటారు. ఆ రోడ్డు చీకటిమయంగా ఉండడంతో రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే భయమేస్తుంది. విషసర్పాలు, శునకాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందువల్ల ధవళేశ్వరం పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– పదాల రామకృష్ణ, సీపీఎం కార్యదర్శి, ధవళేశ్వరం

అంధ విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న నరసింహారావు తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుపేద అంధ విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందించడానికి రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం రివర్ సిటీ సంస్థ అధ్యక్షుడు నాళం నరసింహారావు ముందుకు వచ్చారు. ఆరుగురు విద్యార్థులకు రూ.35 వేల చెక్కును అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు చేతుల మీదుగా ఆ విద్యార్థులకు ఫీజును అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక చేయూత అందించడానికి ఎప్పుడూ ముందుంటామని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సిటీ కార్యదర్శి కె.చంద్రశేఖర్, అసిస్టెంట్ గవర్నర్ పీవీఎస్ఎస్ దొరబాబు, బచ్చు సత్యానందం, దీపిక అక్కల, సుంకర నాగేంద్ర కిషోర్, అల్యూమినియం అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి, కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి విధుశేఖర భారతీ స్వామి



రాజమహేంద్రవరానికి చేరుకున్న జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి



వేద సభలో మాట్లాడుతున్న జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి

సీటీఆర్ఐ: ధర్మ విజయ యాత్రలో భాగంగా శ్రీశృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి మంగళవారం రాత్రి రాజమహేంద్రవరం చేరుకున్నారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న శ్రీ శృంగేరి శంకర మఠం, శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ప్రాంగణాల్లో నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఆయనకు నగర ప్రముఖులు, భక్తులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రాచార్య శలాక రఘునాథశర్మ స్వాగత పత్రం సమర్పించారు. కార్యక్రమాల కన్వీనర్లు విశ్వనాథం భాస్కరరామ్, మద్దూరి శివసుబ్బారావు, శంకరమఠం ధర్మాధికారి వేలూరి బాలాజీ, వేదుల శేషగిరి వరప్రసాద్, గౌతమీ నేత్రాలయం సీఈఓ వి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్ పనులు వేగవంతం చేయండి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా సైన్స్ సెంటర్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆప్‌కాస్ట్ (ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) మెంబర్ సెక్రటరీ చలపతిరావు అన్నారు. బొమ్మూరులో సిద్ధమవుతున్న జిల్లా సైన్స్ సెంటర్‌ను ఆయన సందర్శించి పెండింగ్ పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని, అలాగే ఇంకా ఇంప్లిమెంట్ చేయాల్సిన పనులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అతి త్వరలోనే దీనిని ప్రారంభిస్తామన్నారు. రాజమహేంద్రవరం సైన్స్ సెంటర్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడపబడుతున్న సైన్స్ సెంటర్‌లో అతి పెద్దదని తెలిపారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడానికి ఇక్కడ అవకాశం కల్పిస్తామన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజలు కూడా ఇక్కడకు వచ్చి ఉత్సాహంగా, వినోదాత్మకంగా గడపవచ్చని, అందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయని ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మేకా సుసత్య రేఖ తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ దుర్గయ్య మాట్లాడుతూ ప్రకృతిలో మమేకమవుతూ సైన్స్ నేర్చుకోవచ్చన్నారు. ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ఎస్.కోమలి, కీర్తి, టెక్నీషియన్ అజయ్ పాల్గొన్నారు.

దేశాన్ని అదానీకి తాకట్టు పెడుతున్న మోదీ



సమావేశంలో మాట్లాడుతున్న లక్కరాజు రామారావు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని మోదీ దేశాన్ని అదానీకి తాకట్టు పెడుతున్నారని కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడుతున్న అదానీని అరెస్ట్ చేసే వరకూ కాంగ్రెస్ పార్టీ అటు పార్లమెంట్ వేదికగా ఇటు ప్రజల్లోనూ నిరంతర ఉద్యమ బాట పడుతుందని వెల్లడించారు. అదానీపై విదేశాల్లో కేసులు ఉన్నందున ఇక్కడ కూడా ఆయనపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబీ, జిల్లా కాంగ్రెస్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ సమావేశం

కంబాలచెరువు: స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ కేసులను సత్వరం పరిష్కరించాలని, దీనికి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్ కోసం వేసిన అర్జీల వివరాలు తెలుసుకున్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

ధవళేశ్వరం: కార్తిక మాసం సందర్భంగా మంగళవారం ధవళేశ్వరం అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. ఉదయం నగర సంకీర్తన, విఘ్నేశ్వర పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం లక్ష బిల్వార్చన, మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చన, లలితా పారాయణ నిర్వహించారు. సాయంత్రం రుద్ర హోమం, సూర్య నమస్కారాలు, జ్యోతిర్లింగార్చన, ఆకాశ దీపారాధన, ధూప ప్రాకార సేవ, స్వామివారికి శాంతి కల్యాణం, పండిత సత్కారం జరిగింది. రాత్రి నీరాజన మంత్ర పుష్పాల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శంకరమంచి విశ్వనాథశర్మ, మంగళంపల్లి చంద్రశేఖర శాస్త్రి ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన జరిగింది.

కేంద్ర విధానాలను నిరసిస్తూ ప్రదర్శన

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు, రైతులు దేశ వ్యాప్తంగా చేస్తున్న ప్రదర్శనలకు మద్దతుగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు మోరంపూడి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ఎల్ఐసీ కార్యాలయాల ముందు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, మహిళా కన్వీనర్ శిరీష, రామలక్ష్మి, నాయకులు ఏకే విశ్వనాథ్, జిలానీ, శిరీష్ కుమార్, రమేష్ బాబు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రకాష్‌బాబు

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) సంయుక్త ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అనేక మంది అక్రమ రవాణా, వెట్టిచాకిరీకి గురవుతున్నారన్నారు. ఈ బాధితులను కాపాడేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నల్సా 'అక్రమ రవాణా బాధితులు, వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ బాధితుల పథకం, 2015' ద్వారా అందిస్తున్న సేవలను తెలిపారు. నల్సాకు చెందిన 15100 టోల్ ఫ్రీ నంబర్ వినియోగించుకునే విధానాన్ని చెప్పారు. ఐజేఎం ప్రోగ్రాం పార్ట్నర్ ఎం.జేసుదాస్ మాట్లాడుతూ బాధితులను కాపాడేందుకు పనిచేసే బృందాలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐజేఎం సభ్యులు, రెవెన్యూ, పోలీస్, లేబర్ డిపార్ట్‌మెంట్, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, వివిధ ఎన్‌జీఓ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా బాల్‌రంగ్ పోటీలు



బాల్‌రంగ్ ఫెస్టివల్‌కు ఎంపికైన విద్యార్థినులతో రాజు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో మంగళవారం జిల్లా స్థాయి జాతీయ బాల్‌రంగ్ ఫెస్టివల్-2024 పోటీలు ఉల్లాసంగా జరిగాయి. ఇందులో బొమ్మూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన సంప్రదాయ జానపద నృత్యం రాష్ట్ర స్థాయి జాతీయ బాల్‌రంగ్ ఫెస్టివల్ పోటీలకు ఎంపికైంది. ఇందులో శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాంధీపురం సుంకరభాస్కరరావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొని తమ ప్రదర్శనలను ఇచ్చారు. ఎంపికైన జట్టు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి జాతీయ పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు తెలిపారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా కేవీ సూర్యనారాయణ, రాజేష్, డీఎస్‌వీ సత్యనారాయణ, న్యాయ నిర్ణేతలుగా ఎస్తేర్, చూడామణి వ్యవహరించారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

కడియం: గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని అన్నారు. స్థానిక వెలుగుబంటి రామచంద్రరావు కల్యాణ మండపం వద్ద మంగళవారం రాజమహేంద్రవరం ఎస్ఎమ్ఎఫ్‌జీ గ్రామశక్తి బ్యాంకు ఆధ్వర్యంలో నాని, స్థానిక వెలుగుబంటి యూత్ నేతృత్వంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, ఆర్థో తదితర వైద్య సేవలు అందించారు. వైద్యులు శ్రీవర్ధన్, తేజస్విని, గ్రేసీల నేతృత్వంలోని బృందం పరీక్షలు నిర్వహించింది. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సంస్థ సీనియర్ మేనేజర్ కె.విక్రమ్, ఎస్.రాంబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ నివారణపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇంక్లూజివ్ సెంటర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, యూత్ రెడ్‌క్రాస్ సంయుక్తంగా స్త్రీ హింస, సైబర్ బుల్లింగ్‌కు వ్యతిరేకంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి ప్రోత్సాహంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దిశ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అమీనా బేగం మాట్లాడుతూ సోషల్ మీడియాను వాడుతున్నప్పుడు అపరిచితుల నుంచి వచ్చే లింక్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయరాదని వివరించారు. దిశా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగరత్నం మాట్లాడుతూ గృహ హింస, స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు సమాజంలో తీవ్రమైన సమస్యగా మారిందని, ఈ హింస నిర్మూలనకు మార్గాలను సూచించారు. వక్తలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి సత్కరించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ప్రబల శ్రీవల్లిని, ఇంక్లూజివ్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నీరజని, యూత్ రెడ్‌క్రాస్ సభ్యురాలు బీటీ సుందరిని పాల్గొన్నారు.

అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి



రిటైర్డు ఐఏఎస్ అధికారి రామచంద్ర తేజావత్‌ను సత్కరిస్తున్న జయంత్‌కుమార్, ప్రసాద్



గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కడియం హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఒడిశా మాజీ ప్రధాన కార్యదర్శి రామచంద్రు తేజావత్ అన్నారు. మంగళవారం ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఆధ్వర్యంలో 'సంవిధాన్ దివస్'ను గోదావరి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత సభలో రామచంద్రు తేజావత్ మాట్లాడుతూ యువ ఉద్యోగులు, విద్యార్థులు రాజ్యాంగాన్ని చదవాలని, సమాజ పురోగమనానికి దాని విలువలను మలచుకోవాలని అన్నారు. ఓఎన్జీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ (ప్రొడక్షన్) జయంత్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ సమాన అవకాశాలను కల్పించిందన్నారు. ఫార్వర్డ్ బేస్ హెడ్ పీవీఎస్ ప్రసాద్, జనరల్ మేనేజర్ (జియాలజీ), ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ కొమ్ము సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, మానవ హక్కుల పట్ల అంబేడ్కర్ నిబద్ధతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఆధ్వర్యంలో సంవిధాన్ దివస్ సందర్భంగా ఏవీ అప్పారావు రోడ్డు నుంచి బేస్ కాంప్లెక్స్ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. దీనిని ఓఎన్జీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ (ప్రొడక్షన్) జయంత్‌కుమార్ ప్రారంభించారు.

సీటీఆర్ఐ: రాజ్యాంగానికి బద్ధులై ప్రభుత్వం పాలన సాగించాలని రాజమహేంద్రవం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరం బస్టాండ్ వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దీనికి మాజీ శాసనసభ్యుడు రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి హాజరై కేక్ కట్ చేశారు.

కడియం: పొట్టిలంకలో జైభీమ్ యూత్, రిపబ్లికన్ పార్టీ నాయకుడు నక్కా వెంకటరత్నరాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. బడుగు సత్తిబాబు, నక్క చంటిబాబు, అంబటి రాజారత్నం, బెలమెన్ శివాజీ, మోగలపు రాజు, ఎం.హేమంత్, నాంబతుల శ్రీను, నక్క వెంకటదొర తదితరులు పాల్గొన్నారు. మురమండలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ గ్రామ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. గెడ్డం ఇస్సాకు, తూలూరి చిన్న అబ్బాయ్, వడ్డి ప్రకాశం, సొసైటీ సభ్యులు బత్తిన లాజర్, తూలూరి సాగర్ పాల్గొన్నారు. దేశంలో అందరికీ రాజ్యాంగ ఫలాలు అందాలని ఇన్‌చార్జి హెచ్ఎం రఫీయుద్దీన్ అన్నారు. స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ, సాంఘిక దినోత్సవం నిర్వహించారు.

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజ్యాంగ కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.వీరేందర్‌నాథ్, సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని వ్యవసాయ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కింద ఆఫీసర్లు సీహెచ్ సునీత, హెచ్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. హుకుంపేటలో బీఆర్ అంబేడ్కర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కా విజయ్‌కుమార్, సభ్యులు, ఎస్సీ పేట యూత్ పాల్గొన్నారు. బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ ఏ.గురుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మన అనుభవిస్తున్న స్వేచ్ఛ సమానత్వం, స్వాతంత్ర్యం రాజ్యాంగం ద్వారా సంక్రమించినవేనని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి కార్యాలయ ఏడీ వెంకట్రాజు, సూపరింటెండెంట్లు నాగేశ్వరరావు, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.